త్యాగానికి శిక్ష

ప్రణవి

ప్యూన్ తెచ్చిన ఆపీసు పేపర్లు చూసి, సంతకాలు పెట్టాడు మోహన్‌బాబు. మళ్ళీ తనను డిస్టర్బ్ చెయ్యవద్దని, అతనిని పంపాడు.

అంతలో వుయ్యాలలో వున్న పాప లేచి, యేడ్చింది. వెంటనే లేచి, పాపను చేతుల్లోకి తీసుకొని, అక్కడే వున్న పాలబాటిల్‌తో పాపకు పాలు పట్టాడు. పాలు కడుపునిండా తాగి, కేరింతలు కొడుతూ, నవ్వుతూన్న పాపముఖంలోకి దీక్షగా చూశాడు.

పాప ముమ్మూర్తులా తల్లిని పుణికి పుచ్చుకుంది. ఆ కళ్ళూ, ముక్కూ, నోరు అంతా రాధ పోలికే! వుయ్యాలలో

నవ్వుతున్న పాపను, లోపలి గదిలో గోడకు వ్రేలాడుతున్న రాధ ఫోటోను మార్చి-మార్చి చూసాడు మోహన్‌బాబు. పాప బోసినవ్వులు, సెలయేటి గల గలలవంటి రాధ నవ్వులా తోచింది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. ఉయ్యాలను గట్టిగా వూపి, దూరంగా వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు. బయటలాన్‌లో విరబూసిన గులాబీలవంక తదేకంగా చూస్తున్నాడు.

* * *

గులాబీ పువ్వంటే తనకెంతో యిష్టం. ప్రతిరోజూ తోట గులాబీలను స్వయంగా కోసి, మనసైన మగువలకి, మక్కువతో అలంకరించి, మధుపాయిలా అనుభవించేవాడు. చేతినిండా డబ్బుంది. బట్టల మిల్లులో షేరుంది. చక్కటి బంగళా. తల్లిదండ్రులు విమాన ప్రమాదంలో మరణించాక, బ్రహ్మచారియైన మేనమామ అండదండలతో పెరిగాడు. ఇద్దరు చెల్లెళ్లూ కాలేజీలో చదువుకుంటున్నారు.

యవ్వనపు హరివిల్లులోని రకరకాల రంగులను రంజు రంజుగా అనుభవిస్తున్నాడు. వోసారి మేనమామ పెద్ద చెల్లికి, మంచి సంబంధం తెచ్చాడు. కానీ, అక్కర్లేదని వెళ్ళారు. వారు పిల్ల నచ్చక; కట్నం చాలక కాదు! పిల్ల అన్న జులాయికోరు; అతనికి తాగుడూ, తిరుగుడూ వుందని!

ఆ మాటలకు మొదటిసారి బాధపడ్డాడు. తన ప్రవర్తన-చెల్లెళ్ళ విషయంలో అంతటి దుష్ఫలితాల నిస్తుందని తానెన్నడూ వూహించలేదు!

తర్వాత చాల సంబంధాలు వచ్చి, ఆ ఒక్క కారణంచేతే తిరిగిపోయాయి. చివరికి చెల్లి తనకు పెళ్ళి వద్దంది.

అంతలో మేనమామ మరో మార్గం ఆలోచించి, మొదట తనకు పెళ్ళి చేస్తానన్నాడు. అప్పుడూ అదే ఫలితం. యెవ్వరూ తనకు పిల్లనివ్వడానికి యిష్టపడలేదు.

ఇవన్నీ చూసి, తానే వో నిర్ణయానికి వచ్చాడు. చదువు-అందం వున్న వో బీదింటి పిల్లను చూడమని, యిదికూడా కుదరకపోతే, తానిక జన్మలో పెళ్ళి చేసుకోనని మామయ్యకు చెప్పాడు.

తత్ఫలితంగా బీదింటి పిల్ల అయిన అందాలరాణి రాధతో తనకు పెళ్ళి జరిగింది. రాధ తన మామగారికి మొదటి భార్య కూతురు! ఆమెను యెలాగైనా వదుల్చుకోవాలని, రాధ మారుటితల్లి తనకు రాధనివ్వటానికి అంగీకరించింది.

రాధ కాపురానికొచ్చిన కొత్తలో తాను కుదురుగా వున్నాడు. తర్వాత మళ్ళీ పాత పాఠమే! తాగడం, బయట అమ్మాయిలతో తిరగడం! ఒక్కొక్కసారి రెండు మూడు రోజులు కూడా యింటి ముఖం చూసేవాడుకాదు.

ఒకరోజు సాయంత్రం ఆఫీసునుండి

రాగానే డ్రెస్ చేసుకొని, కార్లో బయ లేరబోయాడు. రాధ, 'ఒక్క క్షణం కూర్చుని టిఫిన్ తీసుకు వెళ్ళమంది' అలాగేనని కూర్చున్నాడు తాను.

రాధ వో ప్లేటులో చికెన్‌ఫ్రై, వో గ్లాసుతో మంచినీళ్ళు, మరో ఖాళీగ్లాసు తెచ్చి, అతని ముందుంచింది. బీరువా తెరిచి, వో బ్రాందీ బాటిల్ తీసి, సీలు తీసి, గ్లాసులో వొంపింది. అది చూసి విస్తుపోయాడు తాను.

"తీసుకోండి! వీటికోసమేగా మీరు బయటికెళ్తున్నారు? అవిక్కడే వుంటే, మీ కా శ్రమ తప్పుతుందిగా? ప్లీజ్! తాగండి!" అంటూ స్వయంగా బ్రాందీ గ్లాసుని తన నోటి కందించింది. నిర్విణ్ణుడై బ్రాందీ సిప్ చేశాడు.

మరో రోజు మేడమీది గదిని శోభ నపు అలంకరణలతో తీర్చి దిద్దింది. తనను పైకి తీసుకెళ్ళి అంతా చూపింది. తన యిష్టానికి యెదురే లేదని, కనుక, కోర్కెలను తీర్చుకోడానికి బయటికెళ్ళి నలుగురికి చులకనవ్వవద్దని, మనసుకు నచ్చిన యువతిని, రహస్యంగా యిక్కడికే రప్పించుకొని, అనుభవించ మని కోరింది. ఆ మాటలకు మరోసారి స్తంభించిపోయాడు. ఇది నిజమా? కలా?

రాధ తనకు అర్థంకావటంలేదు! 'సాధారణంగా స్త్రీలు భర్తని తాగుడు మాన్పటానికి ప్రయత్నిస్తారు. పరస్త్రీ ముఖం చూడటం సహించరు! మరి, యిదేవిటి? రాధ యిలా చేస్తూంది? రాధ మనిషేనా? మానవాతీత శక్తా?'

మరోసారి ఆఫీసునుంచి వస్తూ, యింటికి రాకుండా, ప్రియురాలి యింటికి వెళ్ళాడు బాగా తాగాడు. ప్రియురాలి మాటలు వింటూ, ఆమె కోర్కెలు తీర్చడానికి పర్సులోని డబ్బంతా యిచ్చి, ఆమె అందించిన బ్రాందీ-వగైరాలు మితిమీరి తాగాడు. ఫలితంగా, నిబ్బరించుకోలేక, ఆ గది లోనే పెద్ద వాంతి చేసుకొన్నాడు. ఆమె తనను చీదరించుకుంది. ఇప్పటికీ ఆ సంఘటన తనకు బాగా గుర్తు. చీద రించుకొని, విసుక్కొని, పనిమనిషి చేత, తనను రిక్షాలో యెక్కించి, యింటికి పంపింది.

రిక్షా కాంపౌండ్‌లోకి రావడం చూసిన రాధ ఆత్రంగా యెదురొచ్చి తన స్థితికి కన్నీరు పెట్టుకొని, గదిలోకి చేర్పించింది. బెడ్‌షీద తూలిపోయి, మళ్ళీ రెండుసార్లు పెద్ద పెద్ద వాంతులు చేసుకున్నాడు. అది చూసి యేడ్చింది రాధ. ఆమె చీరె చెంగుతో తన మూతి, ఒళ్ళు, చేతులు తుడిచింది. మంచినీళ్ళు తాగించి, పడుండబెట్టింది.

వెంటనే గదిని క్లీన్ చేసింది. మేన మామ చెప్పాడట. మజ్జిగలో నిమ్మకాయ రసం పిండి, తాగించింది.

తెల్లవారిన తర్వాత లేచి, జరిగిన దానికి బాధపడి, సిగ్గుపడుతూ, మళ్ళీ

ప్రియురాలి యింటికి టాక్సీలో వెళ్ళి రాత్రి తాను విడిచిన తన కారు తీసుకొని వచ్చారు.

రాధ మళ్ళీ అడిగింది. గదిని అలంకరించడంలో కొరత జరిగితే క్షమించమంది. యేంచేయాలో చెప్పమంది. ప్రియురాలి అడ్రస్ చెబితే తానే స్వయంగా వెళ్ళి తీసుకొస్తానంది.

ఇంత జరిగాక, యే ముఖంతో ప్రియురాలి ముఖం చూడడం? యేమని తాగుడు త్రాగడం? తన జీవనవిధానంలో వో గొప్ప మార్పు, తన జీవన ప్రమాణంలో వూహించని వో మలుపు వచ్చింది.

ఒక శుభోదయాన స్నానం ముగించి, భార్యని గుడికి వెళ్దాం రమ్మన్నాడు. ఆమె ఆశ్చర్యపోతుందనుకున్నాడు. కానీ, అలా జరుగలేదు! ఆమె సంబరపడింది. 'పుట్టించిన దేవుడు, తప్పుదారి పట్టిన మనుషుల్ని తప్పక మంచి దారికి మళ్ళిస్తాడని నేను నమ్మాను! దాన్ని ఋజువుచేశాడు. వెళ్దాం రండి!' అంది, పూలసజ్జతో సిద్ధమై. 'యెంత నమ్మకం రాధకి?'

తాను రాధతో గుడికి వెళ్ళిన మూడు నెల్లకి, పెద్ద చెల్లెలికి, చిన్న చెల్లెలికి రెండు మంచి సంబంధాలు కుదిరాయి. వారు పెళ్ళి చేసుకొని, అత్తవారిళ్ళకు వెళ్ళాక తాను తండ్రి కాబోయే సంగతి రహస్యంగా చెప్పింది రాధ! ఆ రోజు యెంతటి ఆనందం అనుభవించాడు తాను!

తాను విశ్వసించి, తలపెట్టిన ప్రతి కార్యము నిర్విఘ్నంగా, విజయం సాధించి, తన చీవితానికి వో అర్థాన్ని, ఆనందాన్ని కల్పించింది రాధ.

అంతటి గొప్ప వ్యక్తి, తనను తండ్రిని చేయడానికి, తల్లివంటి మరో ఆణిముత్యాన్ని తనకు ప్రసాదించటానికి దివ్య వరం పొందితే, చివరికి ఆ వరం ఫలించి, తనను వంటరివాణ్ణిచేసి, రాధ మరణించింది! రాధ నమ్మకాలను నిజం చేసిన ఆ దేవుడే రాధను తననుంచి వేరుచేశాడు!

'యేమిటీ న్యాయం? రాధలేని యీ చీకటిబ్రతుకు తానెలా బ్రతకడం? రాధ ప్రసాధించిన యీ పసిగుడ్డును తానెలా పెంచడం? మోహన్‌బాబు కన్నులనుండి రెండు అశ్రుధారలు, చెంపలమీదుగా జారిపోయాయి.

రాధ చనిపోయిన అదను చూచి ఆమె మారుడుతల్లి, తన కూతుర్ని, భర్తని మోహన్‌బాబు వద్దకు పంపింది. మోహన్‌బాబు మారిపోయాడు గనుక, యిప్పుడు తన స్వంతకూతుర్ని యివ్వాలని ఆమె వుబలాటం!

పసిపిల్లను చూడటానికి మనిషి కావాలి గనుక, రాధ చెల్లి సీతను మళ్ళీ పెళ్ళిచేసుకోమన్నాడు మామగారు.



'సీతకంటే, రాధ కూతుర్ని మరెవ్వరూ స్వంతబిడ్డలా సాకరు' అని చెప్పాడు.

'బిడ్డని సాకడానికయితే మంచిదే; కానీ, రాధ స్థానాన్ని సీత కెలా యివ్వడం?' అంగీకరించలేకపోయాడు మోహన్‌బాబు

మామగారు వోర్పు వహించాడు. నిదానంగా ఆలోచించుకోమన్నాడు. తానొక నిర్ణయానికి వచ్చేవరకు, సీత, తను అక్కడే వుంటామన్నాడు.

సంవత్సరం కావస్తూంది. కానీ, తను రాధను మర్చిపోలేక పోతున్నాడు. అనుదినం, అనుక్షణం రాధ తన కళ్ళ ముందే మెదులుతుంది. పైగా పాప రూపంలో ముమ్మూర్తులా ప్రత్యక్ష మైంది. ఆ జ్ఞాపకాలతో సతమత మవుతూ, సరిగ్గా ఆఫీసుకు కూడా వెళ్ళ లేకపోతున్నాడు. ముఖ్యమైన పేపర్లను యింటివద్దే చూస్తున్నాడు. మామగారు ఆఫీసుకువెళ్ళి తన పన్లు కొన్నిటిని చూస్తున్నాడు.

* * *

'ఈ జీవితం యింతేనా? రాధ లేని బాధని యిలా భరించాల్సిందేనా? ...' బాధగా లేచాడు మోహన్‌బాబు.

వుయ్యాలలో వున్న పాపవంక చూసాడు. నాలుక చీక్కుంటూ నిశ్చింతగా నిద్రపోతూంది. మధ్య మధ్య నవ్వుతుంది. ఒక్కోసారి యేడుపు ముఖం పెడుతూంది.

'నవ్వులు ముగిసి, యేడుపు మిగిలింది-నా బ్రతుక్కి' అనుకుంటూ, బరువుగా నిట్టూర్చి బయటికి సాగాడు.

అదే సమయానికి మామగారు కార్లో వచ్చాడు యెవరో ఆఫీసర్లు యిన్‌స్పెక్షన్‌కి వచ్చారని, అర్జంటుగా వో సారి ఆఫీసుకు రమ్మనమని అడిగాడు.

ఆలోచించి, కారెక్కాడు మోహన్

బాబు. మామగారు వెళ్ళి, సీతను తలుపు వేసుకొనమని, బయల్దేరాడు.

*   *   *

ఈ సంవత్సర కాలంలో సీత ఆ యింటి పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకుంది. చనిపోయిన 'రాధ' అక్కయ్యకు ఆ యింట్లో యెంతటి ఉన్నతస్థానం వుందీ, ఆమె బావగారి హృదయాలయంలో ఆరాధ్యదేవతగా యెలా నిలిచిపోయిందీ గ్రహించింది.

తల్లిలేని పాపను, లోటులేకుండా పెంచగల శక్తిని ప్రసాదించమని, వేయి దేవుళ్ళను రోజూ ప్రార్థిస్తూంది. తనకు మనోధైర్యాన్ని, సామర్థ్యాన్ని ప్రసాదించి తాను మిగిల్చిన పనులుచేసే శక్తిని అనుగ్రహించమని రాధని కోరుతూంది.

వుయ్యాలలోని పాప లేచింది. తన వునికిని తెలపడానికన్నట్టు, యేడ్చింది. సీత వడివడిగా వెళ్ళి, పాపను భుజాన వేసుకుంది. ఇటూ అటూ తిప్పింది. జోకొట్టింది. లాలి పాడింది కొంచెం సేపు ఒళ్ళో పడుకోబెట్టుకొని బొమ్మలతో ఆడించింది.

అంతలో బయట యెవరో తలుపు కొట్టారు. కాల్‌బెల్ నొక్కారు. 'వచ్చే-వచ్చే' అంటూ, పాపని వుయ్యాలలో పరుండబెట్టి, తలుపు తీసింది. యెవరో అపరిచిత వ్యక్తి. ముఖ్ఫై యేళ్ళుంటాయి. చెదిరిన క్రాఫు. ఇన్‌షర్టు వేసుకున్నాడు. చేతిలో యేదో పాకెట్ వుంది. కళ్ళు మాత్రం యెర్రగా, ఆందోళన కలిగించేలా వున్నాయి.

"మోహన్‌బాబుగారి ఇల్లు యిదే కదండీ?..." కంఠం కాస్త కరుకుగా వుంది.

"అవును! కానీ-ఆయనింట్లో లేరు!"

"అలాగా? ... అన్నట్టు, మోహన్ బాబంటే రాధ భర్తే కదూ!"

"అవును! ఆయనతో మాట్లాడాలంటే మీరు ఆఫీసుకే వెళ్ళొచ్చు!"

"అక్కర్లేదు! ముందు నువ్వు లోపలికి నడు!" అంటూ జేబునుండి వో కత్తి తీసి, అకస్మాత్తుగా సీతకు గురిపెట్టి, లోపలికి అడుగువేశాడు. ఆమె నిర్విణ్ణురాలై లోనికి నడిచింది.

అతను గడపదాటి తలుపు బిగించాడు.

"నాక్కావలసిందే యీ అదును!... యెక్కడ?... ఆ వంచకి యెక్కడ? ఆ మోసగత్తె యెక్కడ? నన్ను చేసిన మోసానికి ఆ పాతకిని ముక్కలు ముక్కలు చేసి, యిదిగో యీ కాశ్మీరు సిల్కు చీరె కప్పిగాని పోను! త్వరగా చూపించు దాన్ని!" వుద్రేకంలో పళ్ళు పటపటా కొరికి, యెడమచేతిలోని పాకెట్‌ను చూపాడు.

"యెవరు? మీ కెవరు కావాలి?" వొణుకుతూ అంది సీత

"షటప్! తెలీనట్టు నటించి, ఆలస్యం

చెయ్యాలనుకుంటే, నీ ప్రాణాలు తీస్తాను! కాలేజీలో చదువుకునే రోజుల్లో నన్నే పెళ్ళిచేసుకుంటానని చెప్పి, మిలటరీలో చేరినట్టు తెలవగానే, యింకొకణ్ణి చేసుకుంటుందా ఆ వంచకి? నాతోటే బ్రతుకు! నాతోనే సంసారం! నాతోనే స్వర్గం! అని నన్ను మభ్యపెట్టి నేను మిలటరీకి పోగానే దాని దారి అది వెతుక్కుంటుందా ఆ రాక్షసి? కాశ్మీరు సిల్కుచీరె కావాలని రాసిన ఆ నీచు రాలు, నేను వచ్చేవరకు ఆగలేక పోయిందా? కలవాడిని కట్టుకుని కులుకుతుందా? యెక్కడ ఆ రాధ? దాని గుండెల్లో యీ బాకు దింపి, ఆ వేడిరక్తం చూస్తేగాని, నాకు శాంతి లేదు! కమాన్! చూపించు!" బిగ్గరగా అన్నాడు.

అంతా విని నిశ్చేష్టురాలైంది సీత! యేమిటీ అభాండం? అక్క యితనిని వంచించిందా? ... రాధక్కనా యితననేది?

"యేమిటా నిలువుగుడ్లు?" సీత చెయ్యి పట్టుకుని లాగాడు.

"యూ బ్లడీ! రాధని చూపిస్తావా, నిన్ను చంపమంటావా?"

సీత కెవ్వుమని, చేతిని లాక్కుంది. "యేమిటీ దౌర్జన్యం? మా రాధక్క అలాంటిదికాదు! నువ్వు పొరబడుతున్నావు! నువ్వు అనే రాధ యింకెవరో? మా అక్క కానేకాదు! ఆమె దేవత! ఈ యింటికి యిలవేల్పు!" భయంలో ఆమె కంఠం రుద్ధమైంది.

సీత అరుపుకి వుయ్యాలలోని పాప వులిక్కిపడి, యేడ్చింది.

ఆ మనిషి క్షణంలో వుయ్యాల వద్దకు వెళ్ళాడు. పాపను చూసాడు.

"ఆఁ?...అదే...అవే కళ్ళు...అదే ముక్కు...అదే నోరు! నో డౌట్! ఇవి రాధ పోలికలే! నాకు తెలుసు. యిది రాధ బిడ్డే!...యేయ్! మర్యాదగా నాకు రాధని చూపిస్తావా? లేదా? లేదంటే, ముందు దీన్ని నరికేస్తా! చెప్పు!" అంటూ కత్తిని బలంగా పైకెత్తాడు.

"అమ్మో! వద్దు!" అంటూ, అతని ముందు కురికింది సీత! "ఆ పాపనేం చెయ్యొద్దు! నీకు రాధేగా కావాల్సింది! రా చూపిస్తా." అని, అతని చెయ్యి పట్టుకొని, పక్కనున్న గదికి లాక్కెళ్ళింది.

"అదుగో మా రాధక్క? వెళ్ళి, చంపు! చిత్రవధ చెయ్యి!" అని చేతుల్లో ముఖం దాచుకొని, యేడ్చింది సీత.

ఆ గదిలో గోడకు వేలాడుతున్న రాధ ఫోటో చూచి, అవాక్కయ్యాడు అతను. చేతిలోని కత్తి, పాకెట్టు జారిపోయాయి. "రాధా!" అని బిగ్గరగా అరిచి, చేతులతో తలమీద కొట్టుకుంటూ జుట్టు పీక్కుంటూ యేడ్చాడు.

"రాధా! నాకు కాకుండాపోయావన్న బాధతో వచ్చాను రాధా! మళ్ళీ నాకు

అందకుండా, కనిపించకుండా పోయావా రాధా ? నే నెలా జీవించాలి రాధా ?" రోధించాడు

తనకీ, రాధకీ వున్న ప్రేమ వృత్తాంతమంతా బయటపెట్టాడు. అప్పుడుగానీ, సీతకు గతం గుర్తుకు రాలేదు.

రాధకి వారం వారం మిలిటరీ కాంపు నించి, వో యిన్‌లాండ్‌లెటర్ వచ్చేది. కానీ, అమ్మ ఆ వుత్తరాన్ని చదివి, చించిపారేసేది ! తానేవిటని అడిగితే నోర్మూసుకొని, అవతలికి పొమ్మనేది! అప్పుడే బావగారి సంబంధం వస్తే, క్షణాల్లో కుదిర్చి, వారంలోపలే పెళ్ళి చేసేసింది! 'తాగుబోతు, తిరుగుబోతు అయినా పర్వాలేదు ! ముందు యీ పీడ మన కొదిలితే చాలు' అని అనడానికి యిదికూడా వో కారణమన్న మాట !

"చంపి, రక్తం కళ్ళచూస్తానన్న మగాడివి, ఆడదానిలా రోధిస్తావే ? చంపు! వూరుకుంటావే ?" సీత రెట్టించింది.

"అయ్యో! నా రాధ నాకు లేకుండా పోయిందమ్మా! నన్నసమర్థుడిని చేసి వెళ్ళిపోయిందమ్మా! ఇంకా నా బ్రతుకెందుకు? నే బ్రతికెందుకు ? యుద్ధంలో చావకుండా తిరిగొచ్చింది యిందుకా ? వద్దు! రాధలేని బ్రతుకొద్దు! నే నిప్పుడే చచ్చిపోతా ! నా రాధ దగ్గరి కెళ్ళిపోతా !" అని, కిందపడ్డ కత్తిని అందుకోబోయాడు.

ఆమె వెంటనే ఆ కత్తిని అతని కందకుండా చేసింది.

"వద్దు ! ఆ పని మాత్రం యిక్కడ చెయ్యొద్దు ! నీకు దణ్ణం పెడతా ! నిజంగా నీకు మా రాధక్కమీద అంత ప్రేముంటే, వో సాయం చేసిపెట్టు! రాధక్కకి యీ యింట్లో పవిత్ర స్థానం వుంది మా బావగారి హృదయంలో ఆమె దేవతై కూర్చుంది. నిజమో, అబద్ధమోగానీ, నువ్వు చెప్పే ప్రేమ కథ యిక్క డెవ్వరికీ తెలీదు! మంచి అనిపించుకొని, మనసుల్లో చోటు చేసుకొని, మరణించిన ఆమెకు నీ మాటలు మచ్చను తెచ్చిపెడుతున్నాయి ! నీది నిజంగా పవిత్ర ప్రేమైతే, నాకు మాటివ్వు ! ఈ విషయం మనిద్దరిలోనే వుండిపోవాలి. నీ వల్లగానీ, నా ద్వారా గానీ మరో వ్యక్తికి తెలీకూడదు ! మా రాధక్కకి కళంక మనేది రాకూడదు ! ఊ! మాటివ్వు!" అంటూ ఆమె చేతిని ముందుకు సాచింది.

అతను కన్నీళ్ళు తుడుచుకొని, ఆమె చేతిలో చెయ్యి వేశాడు. "అలాగే నమ్మా! నే నెవ్వరికీ చెప్పను! నా రాధకి కళంకం రానీను!" అంటూ, వెనుదిరిగాడు.

సీత చీరె పాకెట్టుని అతని కిచ్చింది.

"ఇంకెప్పుడూ రాధపేరు ఉచ్చరించవద్దు! రాధ యింటిఛాయలకి రావొద్దు!"

"వద్దమ్మా! ఆ మాట అనవద్దు! ఈ పాపలో నా రాధను చూచుకుంటాను! నువ్వు క్షమిస్తే, యెవ్వరూ చూడకుండా, అప్పుడప్పుడు వచ్చి, చూసిపోతుంటాను! ఆదొక్కటి మాత్రం కాదనకు !" వుయ్యాలవరకు వచ్చి, పాపను చూసి, కన్నీళ్ళు పెట్టుకుంటూ, యెత్తుకుని, గుండెలకు హత్తుకున్నాడు.

"పాపని తే !" అని, అతని చేతుల నుండి పాపను అందుకుంది. "ఇంక నువ్వు వెళ్ళొచ్చు ! మా వాళ్ళు వచ్చే వేళైంది !"

అతను తలుపుబోల్టు తీసి, వో క్షణం ఆగాడు. "నేను రహస్యంగా అప్పుడప్పుడూ వస్తాను. కాదనకు !" అడిగాడు.

"రహస్యాన్ని కాపాడవలసిన బాధ్యత మనిద్దరిదీ' అది గుర్తుంచుకో." ఆఖరిసారి హెచ్చరించింది.

"అలాగే !" నంటూ తలుపు తెరిచాడు.

యెదురుగా సీత తండ్రి, మోహన్ బాబు కనిపించారు. ఓ క్షణం నివ్వెరపోయాడు.

ముసలాయన వుగ్రుడై, తలుపు తీసిన వ్యక్తిని పెటపెటా రెండు చెంప దెబ్బలేశాడు. "వెధవ ! రహస్యంగా అప్పుడప్పుడూ వస్తావట్రా ! ఇదేమన్నా సాని కొంపట్రా ?" మళ్ళీ కొట్టబోయే సరికి, "నాన్నా" అంటూ సీత అడ్డుపడ్డది. "ఛీ! అవతలికి పో! దుర్మార్గురాలా!" అంటూ ఆమెను రెండు వేసి, అవతలికి నెట్టేసరికి, ఆమె పడిపోకుండా అతను పట్టుకున్నాడు.

"నువ్వూ వాడూ కలిసి, దేవాలయం లాంటి యింటిని సానికొంప చేస్తారటే ?" అని మళ్ళీ కొట్టబోయే సరికి, "వద్దు ! అలా అనవద్దు !" అంటూ సీతను పక్కకు లాగి, "నా పేరు రామారావు! నేను మిలిటరీనించి తిరిగివస్తున్నాను! ఈ అమ్మాయికీ నాకు యెలాంటి..." ఆవేశంగా చెప్పబోయే సరికి. సీత అమాంతం అతని నోటికి తన చెయ్యడ్డుపెట్టింది.

"వద్దు ! మాట్లాడొద్దు ! ఇక వెళ్ళిపో!" అని, అతనిని నెట్టబోయింది. అంతలో తండ్రి ఆమెచేతిని పట్టుకొని లాగాడు.

"అతని మాటలు నమ్మకండి నాన్నా ! రామారావు నాకోసమే వచ్చాడు. అతడు నా కాలేజీమేట్ !" యేడుస్తూ అంది.

"నో ! డోంట్......రామారావు బిగ్గరగా అరిచేసరికి, మళ్ళీ ఆడ పులిలా అతనివైపుకు విదుల్చుకొచ్చి, అతనినోటికి చెయ్యడ్డుపెట్టింది. నవ్వు బయటికి నడు ముందు! గెటవుట్!" అతనిని వెనక్కు నెట్టసాగింది.

"వాడే కాదు ! నువ్వు కూడా గెటవుట్ ! ఇంక ఒక్క క్షణం కూడా ఉండడానికి వీల్లేదు ! పోండి ! కట్ట కట్టుకు చావండి !" తండ్రి సీతను కూడా బయటకు గెంటబోయాడు.

అంతవరకు మౌనంగా ఉన్న మోహన్‌బాబు కలుగజేసుకున్నాడు.

"మామగారూ ! మీ రాగండి ! తప్పులు చేసినవారిని క్షమించి, పెడదారులు పట్టినవారిని సరిదిద్ది, దేవళం లాంటి ప్రాశస్త్యాన్ని పొందిన యీ యింట్లో, యీనాడు సీతచేసిన పనికి తగిన శిక్ష నే వేస్తాను!" అంటూ అడ్డు వచ్చి, సీతను లోపలికి పిలిచాడు.

సీత వణుకుతూ వచ్చి, తలవంచుకుని నిలబడింది, ప్రపంచమే శూన్యమను కుటున్న బలిపశువులా.

"మామగారూ! నా గతజీవితం మీకు తెలీందికాదు ! తెలిసికూడా, మీ రెండవభార్య ప్రోద్బలంచేత, జులాయి కోరునైన నాకు ఆణిముత్యం లాంటి మీ రాధ నిచ్చారు. ఆ రాధ రాకతో నా జీవితం మలుపు తిరిగి, తేజోవంతమైంది. నా సంసారం చక్క దిద్దింది. నా చెల్లెళ్ళకి పెళ్ళి చేసింది. నా పాలిట అనురాగవల్లిగా, నాకో పాపని ప్రసాదించి, నా దురదృష్టం కొద్దీ కన్నుమూసింది. ఆమె తిరుగాడిన యీ యింటిని నేను దేవాలయంగా భావించి, అనునిత్యమూ, నా రాధనే ఆరాధిస్తున్నాను. ఆమెను నా గుండెల్లో పదిలపరచుకున్నాను.

"పాపను సాకుతూ, వున్న యీ కొద్ది కాలంలో యిదంతా గ్రహించింది సీత! తన అక్కకు యీ యింట్లో నా గుండెల్లో యెంతటి స్థానముందో తెలుసుకుంది! అందుకే, కీర్తిశేషురాలైన రాధని అపకీర్తి పాలవ్వనియ్యకూడదని తనజీవితమే బలిచేయబూనింది ఈసీత!" అంటూ, చేతులు తలమీదుగా పైకెత్తి నమస్కరించాడు మోహన్‌బాబు.

అంతా ఆయోమయంగా చూశారు.

"అవును! ఈ త్యాగమయిని గురించి నే చెప్పగలను !" అంటూ మళ్ళీ మోహన్‌బాబు ప్రారంభించాడు. ఖిన్నుడైన మామగారి వంక, అచేతనంగా నిలబడ్డ రామారావు వంక ఓ క్షణం చూశాడు.

"నాకు పెళ్ళైన తర్వాత, మా తొలినాటి పరిచయంలో రాధ నా కంతా వివరించింది ! రామారావుని తాను ప్రేమించిన విషయం, పెళ్ళాడా లనుకున్న విషయం, అతను మిలిటరీలో చేరి తనను మరచిపోవడం. చివరికి పిన్ని బలవంతాన తనకు పెళ్ళిచేయడం అంతా చెప్పింది. నేను మనస్ఫూర్తిగా మన్నిస్తే, గతం మర్చిపోయి. నాకు సేవచేసుకుంటూ బ్రతుకుతానంది ! అప్పటి నా సంగతి తెలుసు మీకు !

స్త్రీ వొక ఆటవస్తువు! నా అవసరానికి నేను సరేనన్నాను.

"కానీ, అనుభవాలు అనేకరకాల పాఠాలు నేర్పాయి. 'స్త్రీ ఆటవస్తువు కాదు! పురుషుడే వేటవస్తువు' అని గ్రహించాను! ఇల్లే ఓ ఆలయం; అందు భార్య అనే వో ప్రమిద ప్రేమజ్యోతిని జ్వలించి, అనురాగ దీప్తులను వెదజల్లు తుంది! గుడిలోనివాడు అదృష్టవంతు డైతే, ఆ జ్యోతి నిత్యమూ తనకు సేవ చేస్తుంది! కానీ, నేనో...వో దురదృష్ట వంతుడిని! అందుకే నా జీవనజ్యోతి నాకు దూరమైంది! దుఃఖాంధకారంలో దిగవిడిచిపోయింది!

"అలాగే, ఆ ప్రేమమూర్తి తనకు దక్కలేదన్న బాధతో, బహుశః యీ రామారావు ద్వేషభావంతో యిక్కడికి వచ్చివుంటాడు! రాధను చంపాలని పట్టుపట్టి వుంటాడు! యామై రైట్ మిస్టర్ రామారావ్?" మోహన్‌బాబు కంఠం గాద్గదికంగా వినిపించింది.

రామారావు అవునన్నట్లు తల ఆడించాడు మౌనంగా.

"పూర్ ఫెలో! మళ్ళీ డిస్సపాయింట్ అయ్యాడు. అకస్మాత్తుగా యీ సంగతి అతని ద్వారా తెలుసుకొని, విస్తు పోయుంటుంది సీత! తన అక్క జీవితంలో యిదొక మాయని మచ్చ అవుతుందని, ఆ కీర్తిశేషురాలికి అలాంటి కళంకం వాటిల్లకూడదనే ఒకే ఒక్క పూజ్యభావంతో ఆ నిందని తనమీద వేసుకొని, జీవితాన్ని బలి చేయడానికి సిద్ధపడ్డది సీత! ఇప్పుడు చెప్పండి మామగారూ! సీత చేసిన యీ త్యాగానికి యే శిక్ష విధించాలి?"

మోహన్‌బాబు మాటలకి సీత తండ్రి కనుకొలుకుల్లో అశ్రువులు నిలిచాయి.

మోహన్‌బాబు వడివడిగా గదిలో కెళ్ళి, క్షణంలో తిరిగివచ్చాడు.

"మీరు చెప్పలేకపోతే నేనే చెబుతాను మామగారూ! ఇదో! రాధకు ఆనాడు పెళ్ళిలో వేసిన యీ మాలను, ఇప్పుడు మీ సీతకు వేస్తున్నాను! ఇదే తన త్యాగానికి శిక్ష!" అంటూ రాధ ఫోటోనుండి తీసిన చెమ్కీమాలను సీత మెళ్ళో వేశాడు మోహన్‌బాబు.

సీత నిర్లిప్తంగా అతనివంక చూసి, అమాంతం అతని పాదాలమీద సోలిపోయింది.

మామగారు, రామారావు సజల నయనాలతో చూసారు

మోహన్‌బాబు సీత భుజాలను పట్టుకొని లేవనెత్తేసరికి, రామారావు రాధకోసంతెచ్చిన కాశ్మీరుసిల్కుచీరెను, ఆమెకు బహూకరించాడు దీవిస్తూ!